లాభాల బాటలో టిఎస్ ఆర్‌టిసి

- మేలో రూ.574 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నష్టాల బాట నుంచి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మే నెలలో గట్టెక్కింది. ఒక్క నెలలో ఏకంగా రూ.23 కోట్ల లాభాలను గడించింది. వేసవి సెలవులకుతోడు పెళ్లిళ్ల సీజన్ కారణంగా ఆర్‌టిసికి ఆదాయం భారీగా వచ్చింది. గడిచిన మూడు, నాలుగేళ్లలో సంస్థకు లాభాలు తెచ్చిపెట్టిన నెల ఇదేనని ఆర్‌టిసి వర్గాలు చెబుతున్నాయి.

రూ.574.71 కోట్ల ఆదాయం

మే నెలలో ఆర్‌టిసి 9.21 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. టికెట్లు, ఇతరత్రా కలిపి రూ.574.71 కోట్ల ఆదాయం వచ్చింది. రూ.551.71 కోట్లు ఖర్చు కాగా, రూ.23 కోట్ల లాభాలు వచ్చాయి. ఏప్రిల్ నెలలో రూ.485.29 కోట్ల ఆదాయాన్ని పొందిన సంస్థ రూ.46.05 కోట్ల నష్టాలపాలైంది. ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో సంస్థకు రూ.89.42 కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది. సాధారణంగా ఏడాదిలో ఇతర నెలలతో పోలిస్తే మేలో ఆర్టీసీకి ఆదాయం భారీగా వస్తుంది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు భారీగా ఉంటాయి. సెలవుల్లో ఊర్లకు..ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రదేశాలకు ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఈనెలలో సాధారణంగా ఆదాయం ఎక్కువ ఉంటుంది.

ఆర్‌టిసికి గత మే నెలతో పోలిస్తే ఈ మే నెలలో లాభాలు రావడానికి ప్రయాణికుల సంఖ్య 1.21 శాతం, బస్సులు తిరిగిన దూరం 4.26 శాతం పెరిగినట్లు కనిపిస్తున్నా పెరిగిన ఆదాయంతో పోలిస్తే అది చాలా స్వల్పం. బస్సుల్లో సీట్ల భర్తీ తగ్గినా లాభాలు రావడానికి.. వివిధ సెస్సులతో పరోక్షంగా పెరిగిన ఛార్జీలతో పాటు ఇంధన ఖర్చు తగ్గడం సంస్థకు కలిసివచ్చినట్లు గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది.

తెలంగాణ దేశానికే ఆదర్శం

- కెసిఆర్ దార్శనికపాలనతో రాష్ట్రం ముందడుగు
- దశాబ్ది ఉత్సవాల వేడుకలో జగద్గురువులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం వ్యవసాయం సహా అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందనీ, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లుతున్నదని, రైతులు సహా సమస్త వృత్తులు, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారని, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దార్శనిక పాలనతోనే ఇది సాధ్యమైందని జగద్గురు పంచాచార్య స్వామీజీలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీరశైవ పంచపీఠంలోని కాశీ, ఉజ్జయినీ, శ్రీశైల పీఠాల జగద్గురువులను సిఎం కెసిఆర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా... చంద్రశేఖర శివాచార్య మహాస్వామి (కాశీ), సిద్దలింగ శివాచార్య మహాస్వామి (ఉజ్జయినీ), చెన్నసిద్ధ రమా పండితారాధ్య శివాచార్య మహాస్వామి (శ్రీశైలం) శనివారం ఉదయం ప్రగతి భవన్‌కు చేరుకున్నారు. వారితో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలాంణ రాష్ట్రాల నుంచి పలువురు శివాచార్య మహాస్వామీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిఎం కెసిఆర్, శోభమ్మ దంపతులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధి, అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాల గురించి వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "అనతికాలంలోనే రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సేవ గొప్పది. రైతుకు సాగునీటిని అందించడం గొప్ప విషయం. వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచి, రైతులను కాపాడుతున్న సిఎం కెసిఆర్ పాలన ఆదర్శవంతమైంది. "అబ్ కి బార్ కిసాన్ సర్కార్" అనే నినాదంతో రైతు సంక్షేమ రాజ్యం కోసంపాటుపడుతున్న కెసిఆర్ సంకల్పం గొప్పది" అని జగద్గురువులు అన్నారు.

సనాతన సంప్రదాయాన్ని గౌరవిస్తూ సాదు పుంగవులను ఆదరించడం గొప్ప విషయమని, అందుకు కెసిఆర్ అభినందనీయుడని అభినందించారు. "వేలాదిమంది సాదువులను ఏక కాలంలో ఆహ్వానించి వారిని గౌరవించడం ఆనాడు జనకమహారాజుకే సాధ్యమైంది. తిరిగి నేడు వర్తమాన భారతదేశంలో తెలంగాణలో సిఎం కెసిఆర్‌కే సాధ్యమైంది. సాధు సంతులను ఆదరించే విషయంలో కెసిఆర్ కలియుగ జనకుడు'.." అని వారు కొనియాడారు.

ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ.... రాష్ట్రం అవతరించి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో జరుగుతున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ప్రజలను ఆశీర్వదించడానికి జగద్గురువులు స్వయంగా రావడం తెలంగాణ ప్రజలందరి భాగ్యం అని అన్నారు. "దేశంలో నీరు విద్యుత్తు వంటి సహజ వనరులు పుష్కలంగా లభ్యమౌతున్నాయి. అయినా 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో కేంద్రంలోని పాలకుల నిర్లక్ష్యం వల్ల దేశ వ్యవసాయ రంగం ఎంతో నష్టపోయింది. వ్యవసాయానికి సాగునీరు లేక విద్యుత్తు లేక రైతాంగం అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతు సంక్షేమ పాలన ఈ దేశానికి ఎంతో అవసరమున్నది. నయా భారత్ నిర్మాణం కోసం మీ సంపూర్ణ సహకారం ఆశీర్వాదం కావాలి" అని సిఎం తెలిపారు.

ఈ సందర్భంగా హాజరైన వేదపండితులు కెసిఆర్ దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి, ఫల ప్రసాదాలను అందజేశారు. పంచాచార్య స్వామీజీలను సంప్రదాయపద్ధతిలో కెసిఆర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి బిబి పాటిల్ దంపతులు, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్, మహారాష్ట్ర బిఆర్‌ఎస్ నేతలు శంకరన్న దోండ్గే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారి తదితరులు పాల్గొన్నారు.

నేడు జెఇఇ అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష ఆదివారం దేశవ్యాప్తంగా జరగనుంది. ఈ పరీక్షను ఐఐటీ గువాహటి నిర్వహిస్తున్నది. ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. జేఈఈ మెయిన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. వారిలో 1.90 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. వారిలో 1.46 లక్షల మంది అబ్బాయిలు ఉండగా, 44 వేల మంది అమ్మాయిలున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రాథమిక సమాధానాల కీని ఈనెల 11న, ఫలితాలను అదేనెల 18న విడుదల చేస్తారు. తెలంగాణలో ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్‌తో మొత్తం 13 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపీలో 22 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అర్హత కలిగిన వృత్తిదారులందరికీ రుణమివ్వాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ జోక్యం లేకుండా అర్హత కలిగిన వృత్తిదారులందరికీ రూ.లక్ష రుణమివ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బిసిఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో బెల్లపు దుర్గారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గానికి కేవలం 1200-1500 మంది వృత్తిదారులకు మాత్రమే రుణాలిస్తామంటూ సర్కార్ చెప్పటం సరికాదని తెలిపారు. అర్హత కలిగిన అందరికీ వాటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ వృత్తి సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నాయకులు, వృత్తిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. తద్వారా రుణాల పంపిణీకి విధి విధానాలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల జీవితాల్లో వెలుగు

- సంబురంగా రైతు దినోత్సవ వేడుకలు
- వినూత్నంగా ఎడ్లబండ్లతో ర్యాలీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వలసలను అరికట్టి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపి, రైతే రాజుగా నేడు గ్రామ గ్రామాన రైతులు "రైతు దినోత్సవాన్ని" ఆనంద ఉత్సాహాలతో సంబరాలు చేసుకుంటున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా నాగవరంలో జరిగిన రైతు దినోత్సవం వేడుకలకు మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం నుండి నాగవరం రైతు వేదిక వరకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఎడ్ల బండిపై ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఎండా కాలంలో సైతం చెరువులు అలుగులు పారుతూ రెండు పంటలను పుష్కలంగా పండిస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు అయన మహబూబ్ నగర్ మండలం కోడూరులో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రైతును రాజును చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, రైతు సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రం తీసుకొని సంస్కరణలను సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రైతు దినోత్సవాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో కోలహాలంగా ఉత్సవాలు నిర్వహించారు. రైతులు ఎడ్లబండ్ల ర్యాలీలు, ట్రాక్టర్లలతో ఊరేగింపుగా రైతు వేదికలకు చేరుకున్నారు. కులమతాలకతీతంగా సహఫంక్తి భోజనాలు చేశారు. కందుకూర్ మండలంతోపాటు మరికొన్ని మండలాల్లో నిర్వహించిన రైతు దినోత్సవం వేడుకలకు మంత్రి సబితాఇంద్రారెడ్డి హాజరయ్యారు.

రైతును, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వరంగల్ (ఎనుమాముల) వ్యవసాయ మార్కెట్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అధ్యక్షతన జరిగిన రైతు దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హాజరయ్యారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. వేలేరు మండలంలోని నెల్లికుదుర్ల, షోడశపల్లి, గుండ్లసాగర్ గ్రామాల నుండి ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు, ములుగు జిల్లా గోవిందరావుపేటల్లో రాష్ట్ర గిరిజన మంత్రి సత్యవతి రాథోడ్ రైతు దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి క్లస్టర్ రాంక్య తండాలో జరిగిన కార్యక్రమానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరయ్యారు. రైతుల మోముపై చిరునవ్వే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. రైతు బంధు కింద రాష్ట్రంలో 65 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబాంధవుడని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలపరిధిలోని యండ్లపల్లి గ్రామంలో మూసి ఆయకట్టు రైతాంగం భారీ ఎత్తున రైతు దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎడ్లబండ్ల ప్రదర్శన,ట్రాక్టర్ల ప్రదర్శనతో పాటు కోలాటం, భజన, బృందాలతో ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ జిల్లా చిట్యాలలోని ఉరుమడ్ల గ్రామంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరయ్యారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రదర్శనలు జరిపారు. ఎమ్మెల్యేలు, ఛైర్మెన్‌లు, అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి, సిద్ధిపేట, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి, ఆదిలాబాద్, హైదరాబాద్(బోయిన్‌పల్లి) తదితర జిల్లాల్లో జరిగిన వేడుకలలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామి కీర్తనల గోష్టి గానం

ప్రజాశక్తి-కల్చరల్

ప్రముఖ శాస్త్రీయ సంగీత సంస్థ రామానుజ కళా సాంస్కృతిక నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి జయంతి పురస్కరించుకుని ఆయన విరచిత పంచ రత్న కీర్తనలు గోష్ఠి గానం హృద్యంగా జరిగింది. శాస్త్రీయ సంగీత గాయకులు డాక్టర్ వైద్యనాథన్ నిర్వహణలో గోష్ఠిగానం జరుగగా, విఖ్యాత మృదంగకళాకారుడు డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు శిష్యులు డాక్టర్ డి.ఎస్.ఆర్.మూర్తి బృంద మృదంగ లయ విన్యాసం, హేమ బృందం వీణా వాదనం శ్రోతలను పులకితులను చేశాయి. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సివిల్ సర్వీస్ విశ్రాంత అధికారి చక్రవర్తి, సంగీత విదూషి డాక్టర్ హరిప్రియ పాల్గొని ఎల్లా వెంకటేశ్వరరావును సత్కరించి మాట్లాడుతూ ఎల్లలు దాటిన మృదంగ విన్యాస ప్రావీణుడు ఎల్లా అని కొనియాడారు. విజ్ఞాన సమితి అధ్యక్షుడు సూరి వెంకటేశ్వరులు, కళా సాగరం అధ్యక్షుడు నారాయణ్ పాల్గొన్న కార్యక్రమానికి సంస్థ స్థాపకుడు అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు

భూమితో విడదీయరాని బంధం

- భూమి కోసం సాయుధ పోరాటం చేసిన చరిత్ర తెలంగాణది
- రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో మంత్రి నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రాంతానికి, భూమికి విడదీయరాని బంధం ఉందని, భూమి కోసం సాయుధ పోరాటం చేసిన చరిత్ర తెలంగాణదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ నేడు తెలంగాణా సుస్థిర వ్యవసాయానికి ఆనవాలుగా నిలిచిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, నిరంతర విద్యుత్, మిషన్ కాకతీయ, వంటి ఎన్నో చారిత్రాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. రైతుబంధు వంటి ప్రోత్సాహకాల వలన గ్రామీణ ప్రాంతాల్లో అనేక మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. తనకి చిన్నప్పుడు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో చదవాలన్న కోరిక ఉండేదని కానీ అప్పుడు సీటు రాలేదన్నారు. ఇప్పుడు మంత్రి హోదాలో విశ్వవిద్యాలయానికి వస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. టీఎస్‌టీ ఎస్సీ మాజీ ఛైర్మన్ గంటా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం అంతా నీళ్ళ, వ్యవసాయం చుట్టూ తిరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హార్టికల్చర్ కమిషనర్ హనుమంతరావు, ఆయిల్ పామ్ సలహాదారు శ్రీనివాసరావు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటరమణ విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక భారంలో పత్తి రైతులు

- ప్రకృతి వైపరీత్యం.. కలిసిరాని కాలం
- నిన్నటి వరకు ఇళ్లలోనే భారీగా నిల్వలు
- ఖరీఫ్ ముంచుకొస్తుండటంతో గత్యంతరం లేక విక్రయం
- ఆదుకోని ప్రభుత్వాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తినే జీవనాధారంగా చేసుకొని సాగు చేసిన అన్నదాతలు ఆర్థికభారంలో కూరుకుపోయారు. పంట సాగు ప్రారంభం నుంచే పంట ఎదుగుదలను కోల్పోయింది. పూత, కాత దశలోనూ ఎడతెరిపిలేని వర్షాలు కురవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరానికి కనీసం పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చింది. వచ్చిన పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే సరైన ధర లేకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొన్నారు. మంచి ధర వచ్చినప్పుడు విక్రయిద్దామని రాష్ట్ర వ్యాప్తంగా నెలల తరబడి ఇండ్లల్లోనే పత్తిని నిల్వ చేశారు. మళ్లీ పత్తి గింజలు నాటే కాలం వచ్చినా.. పత్తికి ధర పెరగకపోగా మరింత తగ్గింది. దాంతో గత్యంతరం లేక వచ్చినకాడికి పంటను అమ్మేస్తున్నారు. తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పంటను పరిశీలించగా.. అధిక శాతం జిల్లా రైతాంగం ఈ పంటపైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది. కిందటేడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 11 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఈ లెక్కన సుమారు 80 లక్షల క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ 2022-23 ఖరీఫ్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పొలాల్లో నీళ్ల నిల్వ ఉండి పోయాయి. రోజుల తరబడి నీళ్ల నిల్వ ఉండటం కారణంగా మొలకలు మురిగిపోయి ఎదుగుదల లోపించింది. ఒక్కో రైతు రెండు నుంచి మూడు సార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. ఇదే నష్టం అనుకుంటే.. పంట ఎదిగిన దశలోనూ రోజుల తరబడి వర్షాలు కురవడంతో పూత, కాత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపించింది. పత్తి తీసే వరకు వర్షాలు కురుస్తూనే ఉండటంతో రోజుల తరబడి చేన్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఎకరానికి ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వచ్చిన పంటను అమ్ముకుందామన్నా మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేస్తే సుమారు 32 లక్షల పంట దిగుబడి రావాల్సి ఉంది. కానీ 15 నుంచి 16 లక్షల క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఇందులో కేవలం పది లక్షల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌కు వచ్చింది.

మహారాష్ట్రకు తరలిన పత్తి..!

ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6380 నిర్ణయించగా.. మార్కెట్లో తొలుత క్వింటాల్‌కు రూ.8500వరకు పలికింది. కొన్ని రోజులు మాత్రమే నిలకడగా ఉన్న ఈ ధర అనతి కాలంలోనే రూ.7950కి దిగజారింది. ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు పత్తిని విక్రయించలేదు. కొందరు రైతులు మహారాష్ట్రలోని సమీప మార్కెట్‌లకు తరలించి అనువైన ధరకు పత్తిని విక్రయించారు. చాలా మంది రైతులు నెలల తరబడి క్వింటాళ్ల పంటను ఇంట్లోనే నిల్వ ఉంచారు. ధర మరింత తగ్గుతూ రూ.6600కి పడిపోయింది. దీంతో దిగులు చెందిన అన్నదాతలు మార్కెట్‌కు తరలించి తక్కువ ధరకు విక్రయించారు. ఈ నెల 30వ తేదీ వరకే మార్కెట్లు తెరిచి ఉండే అవకాశం ఉండటంతో పత్తిని అలాగే ఉంచితే ఇబ్బందులు వస్తాయని భావించి గత్యంతరం లేక తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వరంగ సంస్థ సిసిఐ వాణిజ్యపరంగా కొనుగోళ్లు చేపడతామని చెప్పినా ప్రయివేటు వ్యాపారులతో సమానంగా ధర నిర్ణయించడంతో ఈ సంస్థకు రైతులెవరూ పత్తిని విక్రయించలేకపోయారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పత్తి సాగుకు సరైన ప్రోత్సాహం కల్పించలేదు. కొనుగోలు కోసం బడ్జెట్‌లో నిధులు అధిక మొత్తంలో కేటాయించలేదు. దీంతో మార్కెట్‌లో వ్యాపారులూ మంచి ధర ఇవ్వడం లేదు. ఇంత జరుగుతున్నా కేంద్రం పట్టించుకోకుండా ఉంది. రాష్ట్ర ప్రభుత్వమూ సరైన చర్యలు తీసుకోలేదు. పత్తి అమ్మకాలు ముగిసిపోయాయనే కారణంగా జిన్నింగ్ మిల్లులు పత్తి కొనుగోళ్లను నిలిపివేయడం.. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తుండటంతో ఆందోళన చెందిన అన్నదాతలు పత్తిని విక్రయిస్తున్నారు.

గత్యంతరం లేక విక్రయించాను

రైతు నానయ్య- కౌటాల

ఐదెకరాల్లో పత్తి సాగు చేశాను. సుమారు 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. తొలుత క్వింటాల్‌కు రూ.8300 ధరకు రెండు క్వింటాళ్లు విక్రయించాను. ధర పెరుగుతుందనే ఆశతో మిగతా పత్తినంతా ఇంట్లోనే నిల్వ చేశాను. ధరలో తేడా లేకపోవడం.. క్వింటాల్ రూ.6600కు పడిపోవడంతో గత్యంతరం లేక మహారాష్ట్రకు వెళ్లి విక్రయించాను. ఈ ఏడాది ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది.

రైతులు పత్తినంతా విక్రయించారు

శ్రీనివాస్, మార్కెటింగ్ ఎడి, ఆదిలాబాద్

జిల్లాలోని రైతులు 95 శాతం పత్తిని విక్రయించారు. ఆదిలాబాద్ జిల్లాలో మార్కెట్‌కు పది లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి వచ్చింది. కొందరు రైతులు మహారాష్ట్రలో విక్రయించినట్టు తెలిసింది. ఈ నెల 30వ తేదీతో మార్కెట్లు మూతపడుతాయి. రైతుల వద్ద పత్తి ఉంటే వెంటనే విక్రయించాలి.

తహశీల్దార్లకు ఉద్యోగొన్నతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల వేళ రాష్ట్రంలోని పలువురు తహసీల్దార్లు, సెక్షన్ ఆఫీసర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. 16 మంది తహసీల్దార్లు, ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, సిసిఎల్ఎ ఆఫీసర్‌కు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగొన్నతి కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందిన తహసీల్దార్లు, సెక్షన్ ఆఫీసర్లు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దోస్త్‌కు 70,315 మంది రిజిస్ట్రేషన్

36,020 వెబ్ఆప్షన్ల నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిఎస్‌డబ్ల్యూ, బిసిఎ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు 70,315 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నదని తెలిపారు.

ఇప్పటి వరకు 36,020 వెబ్ఆప్షన్లు నమోదయ్యాయని వివరించారు. ఈనెల 11వ తేదీ వరకు వెబ్ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నదని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మంత్రి కొప్పుల క్యాంపు కార్యాలయం

ఎదుట ధాన్యం పోసి రైతు నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ జగిత్యాల జిల్లా కమలపూర్ గ్రామానికి చెందిన సట్టం శెట్టి రాజన్న అనే రైతు తాను పండించిన ధాన్యాన్ని శనివారం ఉదయం ట్రాక్టర్‌లో తీసుకొచ్చి ధర్మపురిలోని మంత్రి క్యాంప్ ఆఫీస్ ఎదుట పోసి నిరసన వ్యక్తం చేశాడు. మంత్రి చెప్పినా కూడా మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని రాజన్న ఆరోపించాడు. మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం రాత్రి క్యాంప్ ఆఫీసులో బస చేశారు. మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఉండగానే ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకువచ్చి క్యాంప్ ఆఫీస్ పోసి నిరసన తెలిపాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ధాన్యాన్ని తీసివేసి ట్రాక్టర్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలనే ఈ విధంగా చేసినట్టు రైతు తెలిపాడు.

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా, ఎ.పి.

I.A.No.597/2022, O.S.No.271/2017

Between:
1) Samarthakurthi Sattemma (Died)
2) Komarapuri Srinivasarao
3) Komarapuri Mani
...Petitioners

AND

Prasanth Kumar Halonon @ Kanna Babu
...Respondents

R-6: Gollapalli Ratnaveni, W/o. (Late) Srinu, R/o. D.No. 28-358, Saibaba Nagar, Jeedimetla, Qutubullapur Ida, Jeedimatla, Rangareddy District.
...6th Respondent

పై నెంబరు పిటీషనులో 6వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పు వేయుచున్నారు. కావున **ది.14-06-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి, **డి.అప్పారావు**
03-6-2023. అడ్వకేట్, రాజమండ్రి.

ప్రేమ జంట ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నో ఆశలతో తమ దాంపత్య జీవితం ప్రారంభించిన ఓ ప్రేమజంట.. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బొల్లక్‌పల్లి గ్రామాల్లో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కొండ వివరాల ప్రకారం.. మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సంతోష్ (25) బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని దాల్‌మాల్ గుట్టకు చెందిన కవిత (22) సుమారు 6 నెలల నుండి ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబీకులు ఒప్పుకోకున్నా ఎవరికి తెలియకుండా నెల రోజుల క్రితం పెళ్లి చేసుకున్నారు. కుటుంబ పోషణకు డబ్బుల్లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతం అయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఇరువురూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

టైమ్స్ ప్రాపర్టీ నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు రోజుల టైమ్స్ ప్రాపర్టీ - నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పోను 2023 జూన్ 3,4వ తేదీల్లో ఉదయం 10:00 నుండి సాయంత్రం 7:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. హైదరాబాద్ కొంపల్లిలోని ఆస్పేసియస్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఎక్స్‌పోను మంత్రి మల్లా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. బిల్డర్లకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

రైతుబంధు, రైతు బీమా ఆదర్శనీయం

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవం సందర్భంగా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని రైతు వేదికలో జరిగిన రైతు దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక రైతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు, రైతు బీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. నల్గొండ జిల్లా రైతాంగానికి వ్యవసాయ పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ. 10 వేల చొప్పున రైతుబంధు పథకం ద్వారా జిల్లాలో 4 లక్షల 83 వేల 179 మంది రైతులకు 5 వేల 243 కోట్ల 99 లక్షల రూపాయలు అందజేయడం జరిగిందన్నారు. ఏ రైతు అయిన మరణించినచో 10 రోజుల్లో అతని కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల బీమా సొమ్మును రైతు బంధు పథకం ద్వారా అందిస్తున్నామని అన్నారు. ఈ పథకం ద్వారా 2018 నుండి 2023 ఏప్రిల్ వరకు 6 వేల 256 మంది రైతు కుటుంబీకులకు 312 కోట్ల 8 లక్షల రూపాయలు అందించామని ఆయన తెలిపారు. జిల్లాలో 2014-15 నుండి 2022-23 వరకు 63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 10 వేల 879 కోట్లు రైతులకు చెల్లించడం జరిగిందని చెప్పారు. వ్యవసాయ సంబంధమైన సాంకేతిక పరిజ్ఞానం ఇతర అంశాలపై రైతులు చర్చించుకుందుకు వీలుగా ప్రతి 5 వేల ఏకరాల క్లస్టర్‌లకు ఒక రైతు వేదికను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు ప్రోత్సహం అందిస్తున్నదని తెలిపారు. ఆయిల్ ఫామ్ మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్‌లకు సబ్సిడీని సర్కార్ అందిస్తుందని తెలిపారు.

రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

- కేంద్ర ప్రభుత్వ విధానాలూ కారణమే
- మరణించిన వారికి సిపిఎం సంతాపం
- సమగ్ర దర్యాప్తు జరిపించాలి : తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైల్వే శాఖ నిర్లక్ష్యం వల్లే ఒడిషాలోని బాలేశ్వర్ జిల్లా బహగానా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం జరిగిందని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఈ ప్రమాదం జరిగేందుకు కారణమని తెలిపింది. ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు సుమారు 300 మంది ప్రయాణికులు మరణించినట్టు, వెయ్యి మంది తీవ్ర గాయాలపాలైనట్టు తెలుస్తోందని పేర్కొన్నారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని వివరించారు. ప్రయాణికుల్లో సుమారు 170 మంది తెలుగు వారున్నారని, కొద్ది మంది చికిత్స పొందుతున్నట్టు వార్తలొస్తున్నాయని తెలిపారు. రైల్వేల ఆధునీకరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని విమర్శించారు. వేలాది మంది ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్ల సొబగుల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. అదే సమయంలో రైల్వే లైన్లు, సిగ్నల్ వ్యవస్థ, ట్రాకుల ఆధునీకరణ చేపట్టకపోవడం శోచనీయమని విమర్శించారు. రైల్వేశాఖలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ట్రాక్ పర్యవేక్షణ, తదితరాల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, గాయపడినవారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడీదే నైతిక బాధ్యత : కూనంనేని

ఒడిషాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మృతులకు సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. భారత రైల్వేలో కవచ్ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాలను అరికట్టనున్నట్టు మోడీ ఘనంగా ప్రకటించారని, అలాంటప్పుడు ఈ ప్రమాదానికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. రూ.కోట్లు ఖర్చుతో రూపొందించిన ఆ పరిజ్ఞానాన్ని రైల్వే స్టేషన్లు, రైల్వేల్లో ఎందుకు అమర్చలేదని తెలిపారు. ప్రయివేటీకరణతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రయివేటు వ్యక్తులు లాభాలే పరమావధిగా భావించి ఉద్యోగులను తగ్గించి, పనిచేస్తున్న వారిపై భారాలు మోపుతారని విమర్శించారు. రైల్వే శాఖ నిర్లక్ష్యంతో వందల మంది ప్రాణాలను బలిగొన్నదని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే ప్రయివేటీకరణను కేంద్రం ఆపాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఈ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలిపారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : ప్రజాపంథా

రైలు ప్రమాదం పట్ల సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఇది ప్రమాదమే కాదని, రైల్వే శాఖ నిర్లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. రైల్వే ప్రయివేటీకరణతో ఉన్న వారిపై పనిభారం పెరగడం, సిగ్నల్ వ్యవస్థలో లోపాలుండం వల్ల వందల మంది మరణానికి కారణమైందని పేర్కొన్నారు. మరణించిన వారిలో ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.25 లక్షలు, పాక్షికంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరపాలని తెలిపారు. దీనికి నైతిక బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి, ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మూడేళ్లకు మించి ఒకేచోట పనిచేస్తే బదిలీ

- ఇసి ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే ఉద్యోగులు మూడేళ్లకు మించి ఒకేచోట పని చేయకూడదని, అలాంటి అధికారులను గుర్తించి బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం శనివారం జిఒ జారీ చేసింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులు, ప్రధాన కార్యదర్శులకు ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. సొంత జిల్లా, నియోజకవర్గాల్లో అలాంటి అధికారులెవరూ విధులు నిర్వహించకూడదని, అలా ఎవరైనా ఉంటే వారినీ బదిలీ చేయాలని నిర్దేశించింది. జులై 31వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తిచేసి, ఆ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. ఆయా రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు కొలువుదీరిన తేదీలను ప్రామాణికంగా తీసుకుని మూడేళ్ల సర్వీసును లెక్కించాలని స్పష్టం చేసింది. తెలంగాణలో మూడేళ్ల వ్యవధిని లెక్కించేందుకు 2024 జనవరి 31వ తేదీని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఒకే జిల్లాలో మూడేళ్లుగా పని చేస్తున్న, సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించకూడదనే విధాన నిర్ణయం మేరకు తాజా ఆదేశాలు జారీ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. బదిలీల ప్రక్రియపై ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు తక్షణం లేఖలు రాయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారులకు మార్గదర్శనం చేసింది. ఆ ప్రకారం.. రెవెన్యూ విభాగంలో జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఉప ఎన్నికల అధికారులు, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, ఎఆర్‌ఒలు, ఇఆర్‌ఒలు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు.. అందుకు సమానమైన అధికారులు మూడేళ్లు ఒకేచోట పనిచేసి ఉండకూడదు. పోలీసుశాఖలో రేంజి ఐజి, డిఐజిలు, రాష్ట్ర సాయుధ పోలీసు విభాగ కమాండెంట్లు, జిల్లా ఎస్‌పి నుంచి ఆర్‌ఎస్‌ఐల వరకు బదిలీ చేయాలి. ఎస్‌ఐలను ఎట్టిపరిస్థితుల్లో సొంత జిల్లాలో నియమించకూడదు. ఇటీవల పదోన్నతి పొంది..అదే ప్రాంతంలో పనిచేస్తున్నా స్థాన చలనం కల్పించాలి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటికే భాగస్వాములైన అధికారులను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముందస్తు అనుమతి తీసుకుని, ఆ ప్రక్రియ పూర్తయిన తరవాత బదిలీ చేయాలి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బదిలీ అయిన అధికారులు తక్షణం ఆ ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలి. తమ బంధువులు ఎవరూ ఆ నియోజకవర్గం/జిల్లా పరిధిలో ఎన్నికల్లో పోటీచేయడం లేదని, తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు న్యాయస్థానంలో పెండింగ్‌లో లేవని ఆయా అధికారులు నామినేషన్ల దాఖలు గడువుకు రెండు రోజుల ముందు నిర్ధారిత నమూనాలో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

- సిఎం కెసిఆర్‌కు కూనంనేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. ఆయా విశ్వవిద్యాలయాల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు 25 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. అటు పరిపాలనలో, ఇటు విద్యారంగంతోపాటు పరిశోధనారంగంలో కూడా వారు అనేక విధాలుగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2015లో సర్క్యులర్‌ను జారీచేసి, సర్వీసు రెగ్యులరైజ్ చేసేందుకు ధ్రువపత్రాలను పరిశీలించిందని గుర్తు చేశారు. కానీ, ఈ ప్రక్రియ పూర్తి కాలేదని తెలిపారు. క్రమబద్ధీకరణకు సంబంధించి వారికి అన్ని అర్హతలున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే వారు వేతనాలు పొందుతున్నారని పేర్కొన్నారు. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులను ఏ విధంగా రెగ్యులరైజ్ చేశారో, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును కూడా క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

తల్లిదండ్రులకు కృతజ్ఞతగా ఉండండి

- ఐఎస్‌బి వ్యవస్థాపక డీన్ ప్రమత్ రాజ్ సిన్హా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పెద్ద చేసిన తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యావేత్తలకు విద్యార్థులు ఎల్లప్పుడూ కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా ఉద్బోధించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 14వ పట్టభద్రుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన స్నాతకోపన్యాసం చేశారు. తరగతి గదిలో పాఠాల కంటే వెలుపల పాఠాలు ముఖ్యమైనవని, ఈ పట్టభద్రుల దినోత్సవాన్ని మానసికంగా జ్ఞప్తిపెట్టుకోవాలని సూచించారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్‌లో ముందుకు సాగేందుకు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి సభ్యుడు, తెలుగు సాహిత్య ఔన్నత్యానికి విశేష కృషిచేసిన ప్రఖ్యాత రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ అందజేసి సత్కరించారు. ఎంఎ తెలుగు అత్తెసరు మార్కులతో ఉత్తీర్ణుడైన తనను గీతమ్ గౌరవ డాక్టరేట్‌తో సత్కరిస్తుందని తెలిసిన తన అమ్మ మంచి ఔషధాలు రాయమని సలహా ఇచ్చిందని, అలాంటి గ్రామీణ నేపథ్యం తనదన్నారు. యురేనియం అవసరంలేని శక్తిని సృష్టించాలని గీతం విద్యార్థులకు సూచించారు. శాస్త్ర విజ్ఞానం ఎంత పెరిగినా సాహిత్యం పాత్ర ఎప్పటికీ తరగదని, కవిత్వం సమాజమంతా బాగుండాలని కోరుకుంటుందన్నారు. గీతం- హైదరాబాద్ వార్షిక నివేదికను అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు సమర్పించారు. గీతం-హైదరాబాద్‌లో ప్రస్తుతం 55 మంది అంతర్జాతీయ విద్యార్థులతో సహా 7,500 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నట్టు చెప్పారు. 180కి పైగా కంపెనీలు గీతమ్‌ను సందర్శించి, 700 మందికి పైగా విద్యార్థులను ఎంపిక చేసుకున్నట్టు తెలిపారు. గీతం హైదరాబాద్ ప్రాంగణంలో 1,265 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్ వంటి వివిధ విభాగాలలో డిగ్రీలు పొందడానికి అర్హత సాధించారు. 1,141 మంది విద్యార్థులు, 10 మంది పరిశోధకులు వ్యక్తిగతంగా హాజరై పట్టాలను స్వీకరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.ఈ 14వ పట్టభద్రుల దినోత్సవంలో గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ్, ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ప్రోవీసీలు డాక్టర్ గీతాంజలి బత్మనాబానే (మెడికల్ సైన్సెస్), డాక్టర్ కె.గౌతమరావు (క్యాంపస్ లెఫ్ట్)బీ డీన్లు ప్రొఫెసర్ కె.శ్రీకష్ణ, (సెర్చ్), ప్రొఫెసర్ సి.విజయశేఖర్ (ఇంజనీరింగ్), ప్రొఫెసర్ విభూతి సన్దేవ్ (అర్కిటెక్చర్), సయ్యద్ అక్బరుద్దీన్ (కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ)బీ అమిత్ భద్ర (మేనేజ్ మెంట్)బీ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొన్నారు.

పంట పోయినంక.. ధర పెరిగింది

- పసుపు క్వింటాలుకు రూ.1500-2000 పెరుగుదల
- మార్చి నెలాఖరుకే రైతుల నుంచి కొనుగోలు
- బడా భూస్వాములకు, దళారులకు లాభాలు
- ఆరుగాలం కష్టపడిన రైతుకు నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పసుపు మార్కెట్ మాయాజాలంతో మరోసారి రైతన్న కుదేలయ్యాడు. ఆరుగాలం కష్టపడి పంటను పండించి మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతు కంటే ఆ పంటను అగ్గువకు కొని నిలువ చేసుకుని ఇప్పుడు అమ్ముకుంటున్న దళారులు, వ్యాపారులకు, బడా భూస్వాములకు పసుపు పంట లాభాలు కురిపిస్తోంది. సీజన్లో ఒక్కసారిగా పంట మార్కెట్‌కు పోటెత్తడంతో క్వింటాకు రూ.4000 నుంచి రూ.4,500కు కొనుగోలు చేసిన వ్యాపారులు.. ప్రస్తుతం అదే పంటను క్వింటాకు రూ.6000-రూ.6500కు అమ్ముకుంటున్నారు. ఈ సీజన్‌లో భారీ వర్షాలతో పంట మునిగి పసుపు దిగుబడి తగ్గడంతో పాటు మార్కెట్‌లోనూ ధర లేక రెండు విధాలుగా పసుపు రైతు నష్టపోయాడు.

నిజామాబాద్ జిల్లా పసుపు పంటకు పెట్టింది పేరు. జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, మెండోరా మండలాలతో పాటు పక్క జిల్లా జగిత్యాలలోనూ పసుపును విరివిగా సాగు చేస్తారు. గత సీజన్‌లో జిల్లాలో 35 వేల ఎకరాల్లో పంటను సాగు చేశారు. ఈ పంటను జనవరి నెలఖారు నుంచి ఏప్రిల్ చివరి వరకు రైతులు మార్కెట్‌లో అమ్ముతారు. కానీ ఈ సీజన్‌లో పసుపు పంట ధర భారీగా పతనమయింది. ఒక్కసారిగా మార్కెట్‌కు పంట పోటెత్తడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను అమాంతం తగ్గించారు. క్వింటాకు ఏకంగా రూ.4000-రూ.4500 వరకు కొనుగోలు చేశారు. అంతకుముందు ఏడాది రైతులు తమ పంటను రూ.8000 వరకు కూడా అమ్మకాలు చేశారు. కానీ ఈ ఏడాది ధర ఏమాత్రమూ పెరగలేదు. ఒక్కో రోజు మార్కెట్‌కు 14,000 క్వింటాళ్ల వరకు పసుపు వచ్చి చేరింది. కానీ 90 శాతం మంది రైతుల పంటను క్వింటాకు రూ.5000 లోపు కొనుగోలు చేశారు. అమ్మకం సీజన్ ముగియగానే పసుపు ధర అమాంతం పెరగడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో క్వింటాకు ధర రూ.1500-రూ.2000 పెరిగింది. అత్యధికంగా రూ.8289 ధర కూడా పలికింది. పైగా ఈ ధర రానున్న క్వింటాకు రూ.తొమ్మిది వేల నుంచి రూ. పది వేలు వరకూ పెరగొచ్చని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. సీజన్లో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న దళారులకు, వ్యాపారులకు, బడా భూస్వాములకు ప్రస్తుతం రెండింతల లాభాలు పొందుతున్నారు.

మహారాష్ట్ర రైతు కన్నా తక్కువ ధర..

మహారాష్ట్రలో సాగు చేసే పసుపు పంటతో పోల్చితే జిల్లాలో సాగయ్యే పసుపు పంట నాణ్యత ఎక్కువగా ఉంటుంది. కానీ విచిత్రమేమిటంటే జిల్లా రైతుల కన్నా ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్న మహారాష్ట్ర రైతులకు ధర ఎక్కువ పలకడం గమనార్హం. జిల్లాలో సాగయ్యే పసుపుతో పోల్చితే మహారాష్ట్ర పంటలో కొంత ఎరుపు రంగు వస్తుంది. కానీ ఇప్పుడు ఈ పంటకు సగటున క్వింటాకు రూ.6060 వరకు పలుకుతోంది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మే నుంచి జూన్ వరకు మహారాష్ట్ర పసుపు అమ్మకాలు జరుగుతాయి.

నేటి నుంచి జి20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశం

- కేంద్ర ఆరోగ్య అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివారం నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జీ20 సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో ఆరోగ్య రంగంలో ప్రధానంగా నివారణ, ఎదుర్కోవటం, స్పందన అనే విషయాలపై దృష్టి సారించినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలపై చర్చించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు ఔషధాలు, వ్యాక్సిన్లు, థెరపీలు రోగ నిర్ధారణ అంశాలు కూడా ప్రధానంగా ఉంటాయని వెల్లడించారు. 2022 డిసెంబర్ ఒకటిన భారతదేశం జీ20 గ్రూప్ ప్రెసిడెన్సీని తీసుకుందని గుర్తుచేశారు. ఔషధరంగ సహకారంతో యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ సమస్యను అధిగమించే విషయంపై చర్చిస్తామని తెలిపారు. అందుబాటులో, భద్రమైన, ప్రభావవంతమైన, నాణ్యమైన, చవకైన వైద్యసేవలతో పాటు ఆరోగ్య సేవల విస్తరణకు డిజిటల్ హెల్త్ ఆవిష్కరణలు, పరిష్కారాలను ఉపయోగించడంపై సమావేశం లోతుగా విశ్లేషిస్తుందని చెప్పారు. వాతావరణ మార్పులతో వస్తున్న ఆరోగ్య సమస్యలు-సంప్రదాయ వైద్యవిధానాలపై నిపుణులు దృష్టి సారిస్తారని ఆయన వివరించారు.

ప్రపంచ వైద్య అవసరాలను తీర్చడంలో టెలిమెడిసిన్ కీలక భూమిక వహిస్తున్నదని అగర్వాల్ ఈ సందర్భంగా చెప్పారు. కో-విన్ వేదిక సులభంగా రక్తనిధి కేంద్రాలను తెలుసుకునేందుకు ఉపయోగపడిందన్నారు. జీ-20 సదస్సులో ప్రపంచ ఆరోగ్యసంరక్షణ కోసం ఆయా దేశాలు ఒప్పందాలు చేసుకుంటాయని వెల్లడించారు. 180 మంది సభ్యులు, 10 ఆహ్వానిత దేశాలు, 22 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హైదరాబాద్‌లో నిర్వహించబోయే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ డివైసెస్ సమావేశం

సదస్సు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మెడికల్ డివైసెస్ అంశంపై సమావేశం నిర్వహిస్తుందని అగర్వాల్ తెలిపారు. కోవిడ్-19 సమయంలో ప్రపంచాన్ని ఆదుకోవడంలో భారతదేశం, తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాయనీ, వ్యాక్సిన్ల ఉత్పత్తి, సరఫరా చేశాయని గుర్తుచేశారు. ఈ సమావేశాలతో మరోసారి భారతదేశం, తెలంగాణ విశిష్టత ప్రపంచానికి తెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 90 శాతం మందికి వ్యాక్సినేషన్ పూర్తయిందని తెలిపారు. అయితే ఇప్పటికీ తక్కువ ఆదాయం కలిగిన దేశాలు, ఆఫ్రికన్ దేశాల్లో ఈ ప్రక్రియ 20 నుంచి 25 శాతం కూడా పూర్తి కాలేదన్నారు.

సాగు విస్తీర్ణం పెరిగింది

- మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా ఏండ్లపల్లి గ్రామంలో శనివారం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో రెండోరోజు రైతు దినోత్సవాన్ని కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని కొనియాడారు. 2014 కు ముందు కేవలం 2,05,463 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందగా నేడు 5 ,82,464 ఎకరాలకు గోదావరి జలాలు పారుతున్నాయన్నారు. ధాన్యం దిగుబడి మూడింతలు పెరిగిందని చెప్పారు. చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా వ్యవసాయానికి రూ. 10వేలు పెట్టుబడి సాయం నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. జిల్లాలో రైతుబంధు పథకం కింద రూ. 2723 కోట్లు పెట్టుబడి అందించారని చెప్పారు. రైతు బీమా పథకంలో 3314 లబ్దిదారులకు రూ. 165.75 కోట్లు అంద జేసినట్లు వెల్లడించారు. తెలంగాణ వస్తే రాష్ట్రంలో కరెంట్ ఉండదని ఆరోపించిన వారికి నేడు కరెంట్ పోనే పోదు అనే స్థితికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. తొమ్మిదేళ్ల వ్యవధిలోనే వందేళ్ల అభివృద్ధితో పోటీ పడ్డామన్నారు. తెలంగాణ సమాజం మరింత అభివద్ధి సాధించాలంటే 2014 కు ముందు,వెనుక పరిస్థితులను ఆత్మవలోకనం చేసుకోవాలని ప్రజలను కోరారు.

ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల ప్రదర్శన

21 రోజుల పాటు రోజుకో శాఖపై నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. వేడుకల రెండోరోజు రైతు దినోత్సవం నిర్వహించగా గ్రామాల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ ప్రదర్శన ముందు కోలాటం, భజన బందాలతో ర్యాలీ నిర్వహించారు. మంత్రి జగదీష్ రెడ్డి స్వయంగా ఎడ్లబండి తొలి రైతుదినోత్సవంలో పాల్గొన్నారు.

కెసిఆర్ దోపిడీని ఎంతకాలం భరిద్దాం?

- న్యూజెర్సీలోని తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకల్లో రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తొమ్మిదేండ్లుగా సిఎం కెసిఆర్‌ను భరించామనీ, ఇంకా ఎంతకాలం భరిద్దామని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ విజయంతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని చెప్పారు. అమెరికా న్యూజెర్సీలో ఎన్‌ఆర్‌ఐలు నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రేవంత్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని వర్గాలు ఎంతో శ్రమించి పోరాటాలు చేశాయన్నారు. వారు త్యాగాలు చేసి రాష్టాన్ని ఏర్పాటు చేసుకుంటే ఒక్క కెసిఆర్ కుటుంబమే పదేండ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తూ అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. అమెరికాలో ఉన్న తెలంగాణ ప్రజలు మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేండ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ రూ. 5 లక్షల కోట్ల అప్పు చేశారని తెలిపారు. రూ 22 లక్షల కోట్లు ఖర్చు చేసినా తెలంగాణ ప్రజల సగటు జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కూడా తెలంగాణ ప్రజలు ఆదరించాలని కోరారు.

కోరమండల్ రైలు ప్రమాదం పట్ల రేవంత్ దిగ్భ్రాంతి

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించి తగిన చర్యలు తీసుకోవాలని రేవంత్ డిమాండ్ చేశారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ.. 20 ఏండ్ల తర్వాత ఘోర రైలు ప్రమాదం జరిగిందన్నారు. రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు.

సోమాజీగూడలో డి బీర్స్ ఫరెవర్ మార్క్ ముద్ర

ప్రజాశకి-హైదరాబాద్ బ్యూరో

డి బీర్స్ ఫరెవర్ మార్క్ ముద్ర ఎంతో ప్రసిద్ధి చెందిన అవంతి, ఐకాన్ కలెక్షన్, సాలిటైర్ రింగులతో కూడిన దాదాపు 500 వజ్రాభరణాల సేకరణను సోమాజీగూడలోని షోరూమ్‌లలో ప్రదర్శించడం జరిగింది. జూన్ 3 నుంచి 28వ తేదీ వరకు ఈ ప్రదర్శనను నిర్వహించబడునని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, రెస్ట్ ఆఫ్ ఇండియా, రిటైల్ హెడ్ సిరాజ్ పి.కె, డివి ఫరెవర్‌మార్క్ వైస్ ప్రసిడెంట్ అమిత్ ప్రతిహరి మాట్లాడుతూ డి బీర్స్ ఫరెవర్ మార్క్ డైమండ్స్‌లో అర్హత సాధించడానికి నిర్ధారించే కఠినమైన ఎంపిక ప్రక్రియను మేము అనుసరిస్తున్నందున, ఉత్తమమైన వజ్రాలను మాత్రమే మా వినియోగ దారులకు అందిస్తున్నామని తెలిపారు.